క్లుప్తంగా

రామాలయంలో పవిత్రోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలో వెలసిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో పవిత్రోత్సవం, నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 5వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయన్నారు. పవిత్ర ఉత్సవాల్లో ప్రతిరోజు పూజలు, హోమం ఉంటాయన్నారు. నవరాత్రి ఉత్సవంలో భాగంగా 4వ తేదీ మత్స్యావతారం, 5న కూర్మావతారం, 6న వరహావతారం, 7, నరసింహావతరం, 8న వామనావతారం, 9 పరశురామావతారం, 10న రామావతారం, 22న బలరామావతారం, 12న కృష్ణావతారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌కు సన్మానం


శ్రీనివాసరావు సన్మానిస్తున్న డీఐజీ గిరిబాబు

చిత్తూరు కార్పొరేషన్: వృత్తి జీవితంలో ప్రశాంతంగా ఉంటూ మంచి వ్యక్తిగా జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) శ్రీనివాసరావు పేరు తెచ్చుకున్నారని డీఐజీ గిరిబాబు తెలిపారు. ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరుకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన గురువారం రిలీవ్ కావడంతో సిబ్బంది వీడ్కోలు పలికారు. ప్రతి ఒకరితో మర్యాదగా మాట్లాడుతూ సౌమ్యంగా ఉండేవారని కొనియాడారు. ఉద్యోగి జీవితంలో బదిలీ సహజమని ఆయన ఎక్కడ ఉన్నా సంతోషంగా ఉంటారని వివరించారు. అనంతరం డీఆర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్లు రహంతుల్లా, రాజారమేష్, చలపతి, వినోద్ సిబ్బంది పాల్గొన్నారు.

కొటేషన్లకు ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని గిరింపేటలో వెలసిన శ్రీదుర్గాంబ దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 13వతేదీ వరకు జరిగే దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈవో మునిశేఖర్ తెలిపారు. అర్చకుల సంభావన, పూల అలంకారం, చలువ పందిరి, విద్యుత్‌దీప అలంకారం, బాక్సులు, స్టీలు పేట్లు, వాయిద్యాలు, భజంత్రీలు, పంబ వాయిద్యం, ప్రసాదం తయారీ, వంట మాస్టరు, దేవాలయ శుభ్రత, మోతగాళ్ల తదితర నిర్వహణకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 21వ తేదీ లోపు ఈవో కార్యాలయంలో కొటేషన్లు ఇచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు.

4వ విడత కౌన్సెలింగ్

కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో నిర్వహించే 4వ విడత కౌన్సెలింగ్‌ను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ గణేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ కాలేజీలో ఖాళీగా ఉన్న కోర్సులకు 4వ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. తదుపరి 28వ తేదీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ప్రభుత్వ హాజరు కావాలని కోరారు. అలాగే మహిళలకు టైలరింగ్ ట్రేడ్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని, ఇతర వివరాలకు 9160012999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హుండీ ఆదాయం రూ.5 లక్షలు

గంగవరం: మండలంలోని కీలపట్ల శ్రీ కోనేటి రాయస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. కానుకల రూపేణా రూ. 5.48 లక్షలు సమకూరిందని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. ఇక్కడ ప్రతి మూడు నెలలకోసారి ఆదాయం లెక్కిస్తారు.

సరైన నిర్ణయం కాదు



వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేయాలను కోవడం సరైన నిర్ణయం కాదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయకూడదు. ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల ఎంతో మంది నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులకు అన్యాయం చేసినట్లే. వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుంది. రిజర్వేషన్ల ఊసు ఉండదు కనుక దళిత, వెనుకబడిన వర్గాలకు నష్టం జరుగుతుంది. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు సైతం అందుబాటులో ఉండవు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఎంసీకి ఇచ్చిన లేఖను వెనక్కి తీసుకోవాలి.

-రంజిత్, బీఎస్సీ విద్యార్థి



ప్రైవేట్‌పరం చేయకూడదు



రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయకూడదు. ప్రైవేట్ వ్యక్తులకు మెడికల్ కళాశాలను అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడం సరికాదు. నూతన మెడికల్ కళాశాలల్లో వసతుల కల్పన చేపట్టాలి. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు పెంచేందుకు అవకాశం ఉండగా, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం దారుణం. రాష్ట్రంలో సీట్లు ఎక్కువ ఉంటే అవకాశం వస్తుందనే ఆశతో ఉన్న విద్యార్థులకు అన్యాయం జరిగింది. ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలి.

-హేమచంద్ర, బీఎస్సీ విద్యార్థి

గ్రామాల్లో స్వచ్ఛతకు పాతర

- గ్రామాల్లో కానరాని పారిశుధ్యం
- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- నిరుపయోగంగా డంపింగ్‌యార్డు పెడ్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


తడి, పొడి చెత్త తొట్టెల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు


ఎగువతవణంపల్లె పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డు

తవణంపల్లె: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. అంటువ్యాధుల ముప్పు పొంచి ఉంది. గ్రామీణ జనం భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు నెలకొల్పింది. ప్రతి ఇంటిలో, వీధుల్లో సేకరించిన వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి వాటి నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలనే ప్రణాళిక రూపొందించింది. పంచాయతీలకు ఆదాయం చేకూరేవిధంగా డంపింగ్ యార్డులో తయారు చేసే ఎరువును స్థానిక రైతులకు తక్కువ ధరలకు విక్రయించాలని సూచించింది. అయితే ఈ వర్మీకంపోస్టు తయారుచేసే విధానాన్ని ఒకటి రెండు పంచాయతీలు తప్ప మిగిలిన పంచాయతీల్లో చేపట్టలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కేంద్రాలు మళ్లీ మూతపడ్డాయి. ఇప్పటివరకు వాటి ఊసే ఎత్తకపోవడం శోచనీయం. గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల కొరతతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలతో అధ్వానంగా మారింది. దీంతో దోమల వ్యాప్తి చెంది విషజ్వరాల బారిన పడుతున్నారు.

అందుబాటులో లేని సంపద కేంద్రాలు

సంపద తయారీ కేంద్రాల్లో గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో సేకరించిన చెత్తను అక్కడికి తరలించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్వహణకు అవసరమైన నిధుల కొరత ఏర్పడింది. మరోవైపు కార్మికులకు అవసరమైన గౌరవ వేతనాలు సకాలంలో అందకపోవడంతో చేతులెత్తేశారు. ఫలితంగా సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

వినియోగంలోకి వచ్చేనా?

కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద కేంద్రాలను ఎప్పుడు వినియోగంలోకి తీసుకొస్తుందో అని ప్రజలు వేచిచూస్తున్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ చేసి పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం చెత్త సేకరణ కోసం పనిచేసే కార్మికులకు వేతనాలు ఎలా చెల్లించాలని, నిధులు ఎలా సమకూర్చుకోవాలని సందిగ్ధంలో ఉంది. సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు నిధుల కొరత వల్ల పంచాయతీ అధికారులు ముందుకు రావడం లేదు.

17 సంపద కేంద్రాలు నిరుపయోగం

మండలంలో 32 పంచాయతీల్లో 17 సంపద కేంద్రాల్లో ఉన్నాయి. ఇందులో మేజర్ పంచాయతీ అరగొండ, తవణంపల్లె పంచాయతీలో మాత్రమే చెత్త సేకరణ నిర్వహిస్తున్నారు. మిగిలిన పంచాయతీల్లో చెత్త సేకరణ చేయకపోవడంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అరగొండ పంచాయతీలో మాత్రమే వర్మీకంపోస్టు తయారీ కొనసాగుతోంది.


నిరుపయోగంగా ఉన్న మూడు చక్రాల బండి

స్వచ్ఛతా హి విజయవంతం చేయాలి

ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛత హీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని కె.పట్నం పంచాయతీలో గురువారం డ్వాక్రా మహిళలకు స్వచ్ఛతా హి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు మహిళలు ముందుకు రావాలని తెలిపారు. పారిశుధ్యం మెరుగుపడితే గ్రామాల్లో అంటువ్యాధులు అరికట్టవచ్చని తెలిపారు. డ్వాక్రా మహిళలు ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛత గ్రామాలుగా తయారుచేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో వాడుకలోకి తెస్తాం



మండలంలోని 32 పంచాయతీల్లోని సంపద కేంద్రాలను అక్టోబర్ 2వ తేదీ లోపు వాడుకలోకి తెస్తాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కోసం గ్రీన్ అంబాసిడర్లను నియమించేందుకు చర్యలు చేపడతాం. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను శుభ్రం చేయిస్తాం. చెత్త సేకరణకు అవసరమైన వాహనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికీ డస్ట్‌బిన్‌లను అందజేస్తాం. వీటి ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరేలా ప్రణాళిక సిద్ధం చేస్తాం.

– అబ్దుల్ కలాం ఆజాద్, ఎంపీడీఓ, తవణంపల్లె

పారిశుధ్యంలో నిర్లక్ష్యం వద్దు..!


హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దని, పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం ఉదయం నగరంలోని మిట్టూరు మస్టర్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మికుల హాజరు నమోదు తనిఖీ చేశారు. వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలు, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు నిర్దేశించిన సమయం క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని, పనుల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని చెప్పారు. పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక మార్పు కనిపించాలని, నగరంలో ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం ఉండొద్దన్నారు. ప్రధానంగా డంపర్ బిన్లు సకాలంలో శుభ్రంగా ఉంచాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య లోపం కనిపిస్తోందని, ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు అవసరమైన పుష్ కాట్లు, డబ్బాలు, డంపర్ బిన్లు ఇతర పరికరాలు ఎన్ని అవసరమో వార్డులవారీగా నివేదించాలన్నారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ

చిత్తూరు కార్పొరేషన్‌లో స్వచ్ఛతాహీ సేవా –2024 కార్యక్రమాలను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చేపట్టాలని నగర కమిషనర్ ఆదేశించారు. మిట్టూరులో గురువారం శుభ్రతా పనులు చేపట్టారు. విద్యార్థులు, స్థానికులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి.. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. స్వచ్ఛతాహీ సేవ –2024 కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని అన్ని ప్రార్థనా స్థలాలు, ఆలయాల వద్ద ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

తవణంపల్లె: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు అధిక దిగుబడి సాధ్యమవుతుందని చిత్తూరు ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని టి.పుత్తూరులో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలంబడి కార్యక్రమాన్ని సందర్శించిన ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి రైతులతో మాట్లాడారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విత్తనం ద్వారా వచ్చే వివిధ రకాలైన రోగాలను విత్తన శుద్ధి చేయడం ద్వారా అరికట్టవచ్చునని వివరించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఎండుతున్న వేరుశనగ పంటను కాపాడుకోవటానికి లీటరు నీటిలో 20 గ్రాములు యూరియాను కలిపిన ద్రావణంను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి సాగు చేయాలి

రైతులు తక్కువ వ్యయంతో సాగు చేసే డ్రమ్ సీడర్ పద్ధతిని అలవర్చుకోవాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి సూచించారు. మండలంలోని ఎగువ మోదలపల్లెలో సాగులో ఉన్న వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పొలంలో రెండు సార్లు వరి సాగు చేస్తే ఒక సారి ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ ఆఖరి దుక్కిలో వేయాలని సూచించారు. యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వివరించారు. వరినాట్లు వేసేటప్పుడు కాలి బాటలు వదలాలని దీని ద్వారా దోమ కాటును నివారించవచ్చని వివరించారు. వరిలో బాక్టీరియా తెగుళ్లను గుర్తించారు. తెగుళ్ల నివారణకు 2 గ్రాములు కార్బెండిజం మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి. ప్రవీణ్, ఏహెచ్‌ఓ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

బంగారుపాళెం: వ్యవసాయం సాగులో రైతులు ప్రకృతి పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేపట్టాలని చిత్తూరు వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని మహాసముద్రం రైతు సేవా కేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. సాగుకు ముందు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వినియోగం, ప్రతికూల పరిస్థితుల్లో ఆచరించాల్సిన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎంత తీవ్రత కారణంగా వాడిపోతున్న వేరువనగ పంటను కాపాడుకునేందుకు రైతులు లీటరు నీటికి 10 గ్రాముల యూరియా ద్రావణం, మల్టీ-కే ద్రావణాన్ని పిచికారీ చేసుకుంటే బెట్టను తట్టుకుంటుందని సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి సీఎల్ఎస్, పీడీఎస్ఎస్ యాప్‌పై అవగాహన కల్పించారు. పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్లను గురించి యాప్‌లో నమోదు చేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఈఓ సాదరయ్య, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల

ఐరాల: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఐరాల సెక్టార్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం వీ.ఎస్.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతోపాటు ఐదేళ్లలోపు చిన్నారులకు సైతం సంపూర్ణ పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే బాలామృతం పిల్లలకు తినిపించాలని తెలిపారు. బిడ్డలకు ఆరునెలలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మస్తానీ పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం


ధ్వజారోహణ పూజల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, నాయకులు

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతంమిట్ట కావమ్మ, మారయ్యల వద్ద మహాభారత యజ్ఞం గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి లక్ష్మరెడ్డి జ్ఞాపకార్థం 18 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. వేద పండితుల ఆధ్వర్యంలో పాండవ, ద్రౌపదీ దేవి విగ్రహానికి పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి జ్యోత్స్న హరికథాగానం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి నుంచి వెంకటేశ్వర నాట్య కళామండలికి చెందిన కళాకారుల నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, మల్‌రెడ్డి, రామాంజులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి నృత్యాంజలి




గణేష దీక్షలతో భక్తులు

కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని దేవస్థాన ఆస్థాన మండపంలో కళాకారులు నృత్యాంజలి సమర్పించారు. కూచిపూడి, భరతనాట్యంతో కళాకారులు గురువారం వీక్షకులను మైమరపించారు. వీటితోపాటు ఆధ్యాత్మిక గీతాలాపానలు, హరికథా కాలక్షేపం, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను అభినందించారు. మహానందీశ్వర స్వామి తరఫున ఆలయ అధికారులు వరసిద్ధి వినాయక స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

అన్నదానం,గోసంరక్షణకు విరాళం

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి గురువారం ఓ దాత నిత్య అన్నదానం, గో సంరక్షణ ట్రస్టుకు నగదు విరాళం అందించారు. చిత్తూరు నగరానికి చెందిన బీఎంరెడ్డి అన్నదానానికి రూ.1,10,000, గో సంరక్షణకు రూ.50వేలు అందజేశారు. వీరికి ఆలయ అధికారులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.




కళాకారుల నృత్య ప్రదర్శనలు

వరసిద్ధుని సేవలో కొరటాల

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం సినీ దర్శకుడు కొరటాల శివ దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలతో పాటు ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈవో గురుప్రసాద్ ఉన్నారు.




హరికథా గానం చేస్తున్న భాగవతారిణి






పట్టువస్త్ర సమర్పణలో మహానంది క్షేత్ర ఆలయ బృందం , ఆధ్యాత్మిక కీర్తనలు ఆలపిస్తున్న సంగీత కళాకారుల బృందం, స్వామిని దర్శించుకున్న దర్శకుడు కొరటాల శివ